అక్రమాలపై నిర్లక్ష్యాన్ని వహిస్తే ప్రజలు తీవ్రంగా నష్టపోయే ఆస్కారం ఉందని హసన్పర్తి మండలం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పై అధికారుల అండతో రెచ్చిపోతున్న ఎమ్మార్వో కిరణ్ కుమార్ పై సమగ్ర విచారణకు ఆదేశించాలని మండల ప్రజల నుండి పెద్ద ఎత్తున వినతులు వెల్లువెత్తుతున్నాయి.రైతుల భూములకు రక్షణ లేకుండా ప్రభుత్వ భూములకు అండగా నిలవకుండా చెరువు శిఖం భూములను కబ్జాలు పెట్టించుటకు రహస్య ఒప్పందాల మధ్య జరుగుతున్న కార్యాలయపు విధులను పటాపంచలు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు వేడుకుంటున్నారు. హసన్‌పర్తి ఎమ్మార్వో కార్యాలయంలో భూ వ్యవహారాలు, భూ భారతి దరఖాస్తులు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, రెవెన్యూ రికార్డులు, చెరువు భూములకు సంబంధించిన అంశాలపై పలు అక్రమాలు,ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయంలో జరుగుతున్నట్లు ప్రచారం అవుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ ఎక్కడ జరుగుతోందని ప్రజలు రైతులు సూటిగా నిలదీస్తున్నారు.ఎమ్మార్వో కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాల ఆరోపణలు ఉన్నత అధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు ఎందుకు చేపట్టడం లేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఆఫీసులో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత ఎమ్మార్వో కిరణ్‌కుమార్ బాధ్యత ఏమిటి? రైతులపై చూపిస్తున్న నిర్లక్ష్యపు ధోరణి ఇటు ప్రజలను అటు రైతులను తీవ్ర మనోవేదనకు తీవ్ర ఆవేదనకు తీవ్ర బాధలకు గురి చేస్తుండగా ఉన్నతాధికారుల అండతోనే ఇలాంటి వ్యవహారం కొనసాగిస్తున్నాడని? అనే ప్రశ్నలు స్థానిక ప్రజలు, రైతుల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా రెండు గుంటల భూమికి సంబంధించిన సర్టిఫికెట్ కోసం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ దరఖాస్తు చేసుకున్న సందర్భంలో ఏఆర్ఐ ప్రసాద్ స్థాయి అధికారి రెండు గుంటల భూమి అడిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తగా? ఉన్నపాటుగా హాసన్పర్తి ఎమ్మార్వో కార్యాలయంలో అకాస్మిక తనిఖీల్లో భాగంగా అడిషనల్ కలెక్టర్ ఆర్డీవోలు స్వయంగా వచ్చి విచారణ చేపట్టి వాస్తవాలపై చర్యలు చేపట్టాలని ఎమ్మార్వో ఆదేశించినప్పటికిని రెండు గుంటల భూమి అడిగి తప్పుడుకు పాల్పడిన ఆర్ఐని వెనకేసుకొచ్చుకొని తప్పుకు పాల్పడని ఆర్ఐని బలవంతంగా బయటకు పంపించి తన పలుకుబడికి తిరుగు లేదని నిరూపించుకోవడమే కాకుండా కార్యాలయంలోని ప్రధాన ఫైళ్ళని సదరు ఆర్ఐ ప్రస్తుత ఎమ్మార్వోలు ఇద్దరు కలిసి చేసుకుంటున్నట్లు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇట్టి ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఒకవేళ ఎమ్మార్వో కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమలతో కూడిన ఆరోపణలు నిరాధారమైతే వాటిని ఖండించాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉందని ప్రజలు గుర్తుకు చేస్తున్నారు. ఈ వ్యవహారాలకు సంబంధించి . స్వయంగా జేసీ స్థాయి నుంచి స్పందన వచ్చిందని చెబుతున్నా, అనంతరం కూడా కార్యాలయ పనితీరుపై సమగ్ర విచారణ జరగకపోవడం వెనుక ఆంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఒకరినొకరు కాపాడుకుంటున్నారా? లేక ఆరోపణలకు సరైన ఆధారాలు లేవా? అన్నది విచారణతోనే తేలాల్సి ఉంది. అదేవిధంగా భీమారం పుట్టలమ్మ చెరువు పరిధిలోని భూములకు సంబంధించి కూడా ఉన్నపాటుగా ఎకరం పైచిలుక భూమి కబ్జా చేయబడి భూకబ్జాదారులు యదేచ్ఛగా మోఖాను శుభ్రపరచుకుంటుండగా ఎమ్మార్వో మాత్రం తనకేం పట్టింపు లేదనే విధంగా వ్యవహరిస్తుండడం పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనేది స్పష్టంగా తెలుస్తున్న నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోనికి రావడం కోసం తక్షణమే ఎమ్మార్వోపై ప్రస్తుత ఆర్ఐపై సమగ్ర విచారణ చేయాల్సిందిగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.గతంలో ఉన్నట్లు చెబుతున్న భూముల్లో కొంత భాగం రికార్డుల్లో ఎలా మారింది? ఎకరం భూమి మాయమైందనే ఆరోపణలకు ఆధారాలేమిటి? భూ రికార్డుల్లో మార్పులు జరిగితే వాటికి సంబంధించిన ఫైల్ నంబర్లు, ఆదేశాలు, అధికారుల సంతకాలు ఏమిటి? చెరువు భూములు, ప్రభుత్వ భూములు, రైతుల భూములపై ఎవరైనా కబ్జాలకు పాల్పడితే రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనేది ప్రధాన ప్రశ్నగా మారి తక్షణ పాటుగా వెలుగులోనికి రావాల్సి ఉందని గ్రామస్తులు మండల ప్రజలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. భూముల హద్దులు, సర్వే నంబర్లు, పాత రెవెన్యూ రికార్డులు, ప్రస్తుత రికార్డులు, పట్టాదారు వివరాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రైతులు తెలియజేస్తున్నారు.అందువల్ల వివాదాస్పద భూములపై ప్రత్యేక సర్వే నిర్వహించి, రికార్డులను సరిపోల్చి, భూమి వాస్తవ స్థితిగతులను ప్రజల ముందుంచాలని పలువురు కోరుతున్నారు. ఇక భూ భారతి వ్యవస్థలో నమోదవుతున్న దరఖాస్తుల విషయంలో కూడా అనేక అనుమానాలతో కూడిన అక్రమాలు జరిగాయని పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మార్వో లాగిన్‌లో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? వాటిపై ఏఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది ఎలాంటి ఫీల్డ్ నివేదికలు సమర్పించారు? ఎన్ని దరఖాస్తులు ఆమోదించారు? ఎన్ని తిరస్కరించారు? తిరస్కరణకు కారణాలు ఏమిటి? ఒకే తరహా భూ సమస్యలకు వేర్వేరు నిర్ణయాలు ఎందుకు వస్తున్నాయి? అనే అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. భూ భారతి పేరుతో హసన్‌పర్తి కార్యాలయంలో జరుగుతున్న భూ పత్రాల అక్రమాల ప్రక్రియలలో అసలు కారకులు ఎవరు? దరఖాస్తును స్వీకరించిన వ్యక్తి నుంచి ఫీల్డ్ స్థాయిలో పరిశీలించిన అధికారి, నివేదికను ధృవీకరించిన అధికారి, తుది నిర్ణయం తీసుకున్న అధికారి వరకు ప్రతి దశలో ఎవరి పాత్ర ఉందో పరిశీలిస్తే ఆరోపణలకు సమాధానం లభించే అవకాశం ఉంది. ఫైల్ నోటింగ్స్, ఫీల్డ్ నివేదికలు, అధికారుల సంతకాలు, దరఖాస్తుల ప్రాసెసింగ్ వివరాలను పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో హైకోర్టు ఆదేశాలకు సంబంధించిన భూ వ్యవహారాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఒక రైతును అత్యంత క్రూరంగా వేధిస్తూ పెద్ద ఎత్తున డబ్బులు డిమాండ్ చేయడమే కాకుండా రైతు వాటిని చెల్లించుకోలేని పక్షంలో పట్టా భూమిగా మార్చబడి ఉన్న సర్వే నెంబర్ను తిరిగి నిషేధిత జాబితాలో పెట్టడానికి ఎమ్మార్వో చేస్తున్న ప్రయత్నాలు అంతా ఇంకా కావని సదరు రైతు కన్నీరు మునిరవుతున్నారు.ఉన్నత అధికారులకు సదరు రైతు భూమిపై తప్పుడు సమాచారం ఇవ్వడమే కాకుండా హైకోర్టు ఆదేశాలను పాటించకూడదంటూ రైతును వేధించాలనే కుయుక్తిని కుట్రలను వేధింపులను పాటిస్తున్న ఎమ్మార్వోపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సదరు రైతు కోరుతున్నాడు. హై కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఎమ్మార్వో ఎందుకు పావులు కదుపుతున్నాడనేది పై అధికారులు గమనించకపోవడం బాధాకరమని సదరు రైతు బాధపడుతున్నాడు.హై కోర్టు ఆదేశాలను ధిక్కరించినట్లు అధికారిక విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. హసన్‌పర్తి ఎమ్మార్వో కిరణ్ కుమార్‌పై కూడా కార్యాలయ పనితీరు, భూ వ్యవహారాలు, దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాల్లో విమర్శలు, ఆరోపణలు వినిపిస్తున్న సందర్భంలో ఎమ్మార్వో కార్యాలయంలో నిర్వహించబడుతున్న ప్రతి అధికారిక కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విచారించి వెలుగులోనికి తెస్తూ మండలంలోని ప్రజలకు మండలంలోని రైతులకు మండలంలోని ప్రతి ఒక్కరికి రెవెన్యూ సేవలు, ప్రభుత్వ సేవలు అందుబాటులోనికి తేవాలని కోరడమైనది. ఎమ్మార్వోకు తెలియకుండా కీలక భూ వ్యవహారాలు జరుగుతున్నాయా?ఎమ్మార్వో తోపాటు తనకు అనుకూల అధికారుల పర్యవేక్షణలోనే ఇవన్నీ జరుగుతున్నాయా? అనేది పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. ఫిర్యాదులు వచ్చినప్పుడు ఎమ్మార్వో స్థాయిలో తీసుకున్న చర్యలు ఏమిటి? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం ఇవ్వాల్సి ఉంది.పై అధికారుల అండ ఉంటే ఎవరైనా ఏం చేసినా చెల్లుతుందా? అనే ప్రశ్నలు కూడా స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఒక ప్రభుత్వ కార్యాలయంలో సామాన్య ప్రజలు, రైతులు తమ భూములు, ధ్రువపత్రాలు, వారసత్వ హక్కులు, రికార్డుల కోసం వస్తారు. అలాంటి సమయంలో వారి దరఖాస్తులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది.దానికి పూర్తి భిన్నంగా హసన్పర్తి ఎమ్మార్వో సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలకు న్యాయం జరిగేది ఎలా అంటూ అనేక రకాల ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.తీవ్రమైన ఆలస్యంతో కూడిన నివేదికల కారణంగా రైతులకు నష్టం జరిగితే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నకు కూడా సమాధానం రావాల్సి ఉంది.రైతుల భూములకు సంబంధించిన వ్యవహారాలు అత్యంత సున్నితమైనవి. ఒక్క రికార్డు మార్పు భవిష్యత్తులో పెద్ద వివాదానికి దారితీయవచ్చు. అందువల్ల పాత సెట్వార్, పహాణీ, అడంగల్, ధరణి/భూ భారతి రికార్డులు, సర్వే వివరాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ పత్రాలు తదితర ఆధారాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఫీల్డ్ స్థాయి నివేదికలు కూడా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. హసన్‌పర్తి ఎమ్మార్వో కార్యాలయంపై వస్తున్న ఆరోపణలు నిజమా? కాదా? అన్నది తేల్చేందుకు జిల్లా స్థాయిలో స్వతంత్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల వ్యవహారం, ఏఆర్ఐల ఫీల్డ్ నివేదికలు, ఎమ్మార్వో లాగిన్‌లోని దరఖాస్తులు, భూ భారతి ప్రక్రియ, చెరువు భూముల రికార్డులు, భూ మార్పులు, ఫైల్ నోటింగ్స్, అధికారుల సంతకాలు, పెండింగ్ దరఖాస్తులు, గతంలో వచ్చిన ఫిర్యాదులు అన్నింటినీ ఒకేసారి పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని అంటున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమని తేలితే సంబంధిత అధికారులపై వచ్చిన అనుమానాలను అధికారికంగా నివృత్తి చేయాలి. కానీ విచారణ లేకుండా ఆరోపణలను పక్కనపెట్టడం వల్ల ప్రజల్లో మరింత అనుమానాలు పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అసలు ప్రశ్న ఏమిటంటే.. హసన్‌పర్తి ఎమ్మార్వో కార్యాలయంలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్న వ్యవహారాలపై విచారణకు ఉన్నతాధికారులు ఎప్పుడు ఆదేశిస్తారు? భూ రికార్డుల్లో మార్పులకు బాధ్యులు ఎవరు? చెరువు భూముల వ్యవహారంలో వాస్తవం ఏమిటి? ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆరోపణల వెనుక చర్యలు ఎక్కడ? భూ భారతి దరఖాస్తులపై విచారణ ఎలా జరుగుతోంది? రైతుల ఫిర్యాదులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి? ఈ ప్రశ్నలకు అధికారిక సమాధానాలు రావాల్సి ఉంది. అక్రమాలను పెంచి పోషిస్తారా.. లేక విచారణకు ఆదేశిస్తారా? అనేది ఇప్పుడు హసన్‌పర్తి ప్రజలు, రైతులు ఉన్నతాధికారులను అడుగుతున్న ప్రధాన ప్రశ్నగా మారింది.సదరు ఎమ్మార్వో కిరణ్ కుమార్ ను తప్పించి క్షేత్రస్థాయి విచారణ చేపడితే కళ్ళు చెదిరే నిజాలు బయటకు వచ్చే ఆస్కారం ఉందని అందువల్ల జిల్లా కలెక్టర్ నేరుగా స్పందించి క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించి నిగూఢమైన విషయాలను వెలుగులోనికి తెచ్చి రైతుల పక్షాన ప్రజల పక్షాన కార్యాలయ ఉద్యోగుల పక్షాన రక్షణగా నిలవాలని కోరనైనది.

# పంటకోత ప్రయోగాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలి

**కచ్చితమైన దిగుబడి వివరాలే ప్రభుత్వ విధాన నిర్ణయాలకు ఆధారం**
**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**





**హన్మకొండ, అక్టోబర్ 6 (జై భీమ్ న్యూస్)**

పంటల దిగుబడి అంచనా కోసం నిర్వహించే పంటకోత ప్రయోగాలను నిర్దేశిత శాస్త్రీయ పద్ధతుల్లో, అత్యంత కచ్చితత్వంతో నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక, వ్యవసాయ శాఖల క్షేత్రస్థాయి అధికారులకు పంటకోత ప్రయోగాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ద్వారా సేకరించే దిగుబడి వివరాలు ప్రభుత్వం తీసుకునే అనేక కీలక విధాన నిర్ణయాలకు ప్రాథమిక ఆధారంగా ఉంటాయని తెలిపారు. కనీస మద్దతు ధర నిర్ణయం, ధాన్యం సేకరణ, ఆహార భద్రత, పంటల బీమా, ఎగుమతులు--దిగుమతుల విధానం, ద్రవ్యోల్బణ నియంత్రణ తదితర అంశాల్లో పంట దిగుబడి గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల క్షేత్రస్థాయిలో నిర్వహించే ప్రతి పంటకోత ప్రయోగాన్ని నిర్దేశిత నిబంధనలు, శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. పంటకోత ప్రయోగాల్లో సేకరించే దిగుబడి వివరాలు కచ్చితంగా, నాణ్యంగా, విశ్వసనీయంగా ఉండేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. ప్రయోగాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, తప్పిదాలకు తావు లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మొత్తం 190 పంటకోత ప్రయోగాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇందులో 100 వరి, 20 మొక్కజొన్న, 60 పత్తి, 10 ఎండు మిరప పంటకోత ప్రయోగాలు ఉన్నాయని వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. విజయ్ చంద్ర మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిర్వహించే పంటకోత ప్రయోగాలను పర్యవేక్షకులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు. నాణ్యమైన, విశ్వసనీయమైన దిగుబడి వివరాలను సేకరించేందుకు ప్రతి ప్రయోగాన్ని నిర్దేశిత విధానంలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల డివిజన్ల వ్యవసాయ సహాయ సంచాలకులు, ప్రణాళిక శాఖ గణాంక అధికారి, మండల వ్యవసాయ అధికారులు, ఉప గణాంక అధికారులు, మండల ప్రణాళిక గణాంక అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా విద్యార్థి నేతృత్వ సమావేశం

**వరంగల్, అక్టోబర్ 6 (జై భీమ్ న్యూస్)**



గ్రేటర్ వరంగల్ 47వ డివిజన్‌లోని నారాయణ పాఠశాలలో ఇ-చాంప్స్ విద్యార్థి నేతృత్వ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యా సంస్థల కేంద్ర కార్యాలయం ఆర్అండ్‌డీ ప్రతినిధి స్వాతిలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వాతిలక్ష్మి మాట్లాడుతూ.. సాధారణంగా ఉపాధ్యాయులు విద్యార్థుల చదువు, ప్రగతి గురించి తల్లిదండ్రులకు వివరిస్తారని, అయితే ఇ-చాంప్స్ కార్యక్రమంలో అందుకు భిన్నంగా విద్యార్థే స్వయంగా తన చదువు, ప్రగతి, ప్రతిభ, వ్యక్తిత్వ లక్షణాలను తల్లిదండ్రులకు వివరించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. వరంగల్ జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తరగతి ప్రయాణం, నేర్చుకున్న అంశాలు, రూపొందించిన ప్రాజెక్టులు, సాధించిన విజయాలను తల్లిదండ్రులకు స్వయంగా వివరించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవలం మార్గదర్శకులుగా మాత్రమే వ్యవహరిస్తారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ప్రదర్శనలను శ్రద్ధగా పరిశీలించి, వారి ప్రతిభను ప్రత్యక్షంగా గుర్తించి ప్రోత్సహించాలని రిజ్వానా ఇమ్రాన్ సూచించారు. విద్యార్థులు తమ అభ్యసన ఫలితాలను స్వయంగా వివరించడం ద్వారా వారిలో మాట్లాడే నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ సామర్థ్యాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు తేజావత్ అనిత, జోనల్ కోఆర్డినేటర్లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, శిరీష, వి.పి.లు అనూష, మౌనిక, అకడమిక్ డీన్ గణేష్, ఏ.ఓ. గుంపుల చేరాలు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# గుర్తుతెలియని వ్యక్తి మృతి.. కాజీపేట పోలీసుల దర్యాప్తు



**కాజీపేట, అక్టోబర్ 6(జై భీమ్ క్రైమ న్యూస్)**

కాజీపేట మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలోని జిరాక్స్ కేంద్రం వద్ద అస్వస్థతకు గురైన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 25వ తేదీ సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో కాజీపేట మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఉన్న జిరాక్స్ కేంద్రం వద్దకు సుమారు 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తి సరైన దుస్తులు లేకుండా, తీవ్ర అస్వస్థతతో వచ్చాడు. అతడి పరిస్థితిని గమనించిన మడికొండకు చెందిన రణధీర్ వెంటనే 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించి, సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించాడు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు అక్టోబర్ 2వ తేదీ రాత్రి 7.12 గంటల సమయంలో మృతి చెందినట్లు విధుల్లో ఉన్న వైద్యుడు నిర్ధారించారు. సరైన ఆహారం, నీరు అందక తీవ్రంగా బక్కచిక్కిపోయిన పరిస్థితిలో ఉండటంతో అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో కాజీపేట పోలీసులు నేరం నంబర్ 286/2026, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 196 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి గుర్తింపు కోసం పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 35 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5.5 అడుగులు, ఛాయ చామనచాయగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన బంధువులు, కుటుంబ సభ్యులు లేదా అతడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వ్యక్తులు కాజీపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు. మృతుడి పూర్తి వివరాలు, కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం కాజీపేట పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యువకుడు మృతి

**హసన్‌పర్తి, అక్టోబర్ 6 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రీన్ వ్యాలీస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారి 563 వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హనుమకొండ భీమారం రుద్రమాదేవి కాలనీకి చెందిన మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సూపరింటెండెంట్ పొన్నోజు శ్రీనివాస్ కుమారుడు పొన్నోజు సుజిత్ (31) అక్టోబర్ 1వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనం నంబర్ టీఎస్-02-ఈజీ-9623పై హుజురాబాద్‌లోని అత్తగారింటికి వెళ్లాడు. అనంతరం అదే రోజు రాత్రి హనుమకొండకు తిరిగి వస్తున్న సమయంలో రాత్రి సుమారు 11.15 గంటల ప్రాంతంలో గ్రీన్ వ్యాలీస్ కళాశాల సమీపంలోని జాతీయ రహదారి 563 వంతెన వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో సుజిత్‌కు తలకు, శరీరంలోని పలు భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అత్యవసర వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన సుజిత్‌ను హనుమకొండలోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అక్టోబర్ 2వ తేదీన సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కిమ్స్ ఆసుపత్రిలో వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ సుజిత్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 5వ తేదీ తెల్లవారుజామున 3.10 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం అక్టోబర్ 6న మృతదేహాన్ని హనుమకొండలోని ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి పొన్నోజు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్ఐ బి. సుజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలు, సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై సమగ్రంగా విచారణ చేపడుతున్నట్లు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.

# తెలంగాణలో కరవు పరిస్థితులు

**హైదరాబాద్, అక్టోబరు 6 (జై భీమ్ న్యూస్) :**

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళనకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జల, వ్యవసాయం, పంచాయతీరాజ్ తదితర శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు. నైరుతి రుతుపవనాల (జూన్--సెప్టెంబర్) వర్షపాతంతో పాటు 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినందున, దీనికి అవసరమైన సమగ్ర సమాచారంతో మరో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. కరవు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్రానికి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరనుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. గతంలో సుమారు 235 మండలాల్లో కరవు పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేయగా, తాజా అంచనాల ప్రకారం ఆ సంఖ్య 320కి పెరిగింది.

# వార్తకే పరిమితం కాదు.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**హసన్‌పర్తి మీడియా పాయింట్ నూతన కమిటీకి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ దిశానిర్దేశం**

**ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా పనిచేయాలి**

**మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి**

**హన్మకొండ, అక్టోబర్ 6 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ పరిధిలోని హసన్‌పర్తి మండల మీడియా పాయింట్ నూతన కమిటీ సభ్యులు మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పాలకవర్గాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రెస్ క్లబ్ పాలకవర్గానికి పూల బొకే అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జర్నలిజం రంగంలో వస్తున్న మార్పులు, ప్రజా సమస్యలపై మీడియా నిర్వహించాల్సిన బాధ్యత, ప్రజలకు--ప్రభుత్వానికి మధ్య మీడియా పోషించాల్సిన పాత్ర, జర్నలిస్టుల ఐక్యత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ హసన్‌పర్తి మీడియా పాయింట్‌ను కేవలం వార్తల ప్రచురణకు పరిమితం చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ఒక ఆదర్శవంతమైన వేదికగా తీర్చిదిద్దాలని సూచించారు. మండలంలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం లభించే వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే జర్నలిస్టుల ప్రధాన బాధ్యతగా భావించాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి బొల్లారపు సదయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా మీడియాకు ఎంతో కీలకమైన బాధ్యత ఉందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా వారధిగా పనిచేయాలని సూచించారు. వార్తల విషయంలో వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యత ఇస్తూ నిష్పక్షపాతంగా, సమతుల్యంగా వ్యవహరించాలని తెలిపారు. పత్రికా విలువలను కాపాడుతూ జర్నలిజం పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా ప్రతి జర్నలిస్టు పనిచేయాలని కోరారు. వ్యక్తిగత ప్రయోజనాలకు దూరంగా ఉంటూ ప్రజా ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా వార్తలను అందించాలని వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య సూచించారు. ఒక సమస్యను వార్తగా ప్రచురించడం మాత్రమే కాకుండా, ఆ సమస్య పరిష్కారం దిశగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా జర్నలిస్టులు మరింత బాధ్యతాయుతమైన పాత్ర పోషించవచ్చని అన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిరంతరం గమనిస్తూ ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టులు ముందుండాలని ఆకాంక్షించారు. మారుతున్న సమాజ పరిస్థితులకు అనుగుణంగా జర్నలిస్టులు కూడా ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని వారు సూచించారు. ప్రస్తుతం ముద్రిత పత్రికలతో పాటు డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలు, ఆధునిక సమాచార సాంకేతికతలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రతి రిపోర్టర్ నూతన సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అయితే వార్తలను వేగంగా అందించడం కంటే ముందుగా వాటి వాస్తవాలను నిర్ధారించడం, విశ్వసనీయతను కాపాడటం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం మరింత ముఖ్యమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, రైతులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. హసన్‌పర్తి మీడియా పాయింట్ అధ్యక్షుడు ఎలుక రాజు సదానందం మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ హసన్‌పర్తి మండల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మీడియా పాయింట్‌ను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. మండలంలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, రైతులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అంశాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు. వార్తల విషయంలో వాస్తవాలను నిర్ధారించుకుని బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని, జర్నలిస్టుల మధ్య ఐక్యతను కాపాడుతూ మీడియా రంగంలో మంచి వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. హసన్‌పర్తి మీడియా పాయింట్ ప్రధాన కార్యదర్శి గరిగే శ్రీనివాస్ మాట్లాడుతూ మీడియా పాయింట్‌లోని జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం ఉంటే ప్రజా సమస్యలను మరింత సమర్థవంతంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని అన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు జర్నలిజం యొక్క మౌలిక విలువలను కాపాడుకోవాలని సూచించారు. వార్తల విషయంలో ఎలాంటి తొందరపాటు లేకుండా వాస్తవాలను నిర్ధారించుకుని ప్రజలకు విశ్వసనీయమైన సమాచారాన్ని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. హసన్‌పర్తి మీడియా పాయింట్‌ను మరింత బలోపేతం చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేస్తామని చెప్పారు. హసన్‌పర్తి మీడియా పాయింట్ నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలను తమ వంతుగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పాలకవర్గం తెలిపింది. మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల మధ్య ఐక్యత, సమన్వయం ఉండాలని, పరస్పరం సహకరించుకుంటూ వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించింది. అనంతరం హసన్‌పర్తి మీడియా పాయింట్ అధ్యక్షుడు ఎలుక రాజు సదానందం, ప్రధాన కార్యదర్శి గరిగే శ్రీనివాస్లను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. నూతన కమిటీ ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసి హసన్‌పర్తి మండల మీడియా పాయింట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు బొల్ల అమర్, సంపేట సుధాకర్, బోడిగే శ్రీను, పాషా, గోకారపు శ్యామ్ తదితరులు పాల్గొని హసన్‌పర్తి మీడియా పాయింట్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. హసన్‌పర్తి మీడియా పాయింట్ ఈసీ సభ్యుడు కందుకూరి సంజీవ్, దాడి బిక్షపతి, అనిల్ కాందారి, రామంచ మధుకర్, ఎం.డి. వాజిద్ తో పాటు బాబు, తంగెళ్ళపల్లి సాంబమూర్తి, తాళ్లపల్లి స్వామి కుమార్, కొడిపాక శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగగా, జర్నలిస్టుల ఐక్యతతో ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని ప్రతినిధులు ఆకాంక్షించారు.




# ఎంజీఎం ఆసుపత్రిలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మిక తనిఖీ





**విధులకు గైర్హాజరైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు.. రోగులకు వేగవంతమైన సేవలు అందించాలని ఆదేశం**

**వరంగల్, అక్టోబర్ 6 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అడ్మినిస్ట్రేషన్ విభాగాలు, రికార్డు రూమ్, ల్యాబ్‌తో పాటు వివిధ విభాగాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లోని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్.. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంజీఎం అడ్మినిస్ట్రేషన్ అధికారిని స్పష్టంగా ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరై తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. అనంతరం రికార్డు రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను క్రమబద్ధంగా భద్రపరచడంతో పాటు రికార్డు రూమ్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ల్యాబ్‌ను తనిఖీ చేసిన ఆమె, అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సిబ్బంది ఐడీ కార్డులు, మాస్కులు, చేతి గ్లౌజులు ధరించి జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం ల్యాబ్‌లో స్లిప్పుల ఆధారంగా నిర్వహిస్తున్న ప్రక్రియలకు బదులుగా ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించి, సాంకేతికతను వినియోగించడం ద్వారా రోగులకు పరీక్షా సేవలు త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ల్యాబ్ సేవల్లో జాప్యం లేకుండా సమర్థవంతమైన డిజిటల్ విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎంజీఎం ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఆసుపత్రి పరిపాలనా వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎంజీఎం ఆసుపత్రి ప్రాంగణంలోకి కుక్కలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆసుపత్రి భద్రత విషయంలో సెక్యూరిటీ గార్డులు అప్రమత్తంగా ఉండి నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, భద్రతకు ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఎంజీఎం సూపరింటెండెంట్ హరిచంద్ర రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజిరెడ్డి, డీబీసీడీవో పుష్పలత తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, అక్టోబర్ 6 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు పాఠశాల విద్య, సమగ్ర శిక్షకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, విద్యార్థుల హాజరు శాతం పెంపు, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడంతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బడి బయట పిల్లలు ఎవరూ ఉండకుండా సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి బాలబాలికను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన లోటుపాట్లను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వాటిని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. విద్యా రంగానికి సంబంధించిన వివిధ అంశాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పీఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా ఆర్టిజన్ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను గుర్తించి నిబంధనల ప్రకారం వాటి తొలగింపు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అక్షరాంధ్ర కార్యక్రమం పురోగతిని నిరంతరం పర్యవేక్షించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులకు ఆధునిక, అనుభవాధారిత విద్య అందించేలా ప్రయోగశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు. పాఠశాల అవసరాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్, స్టెమ్ తదితర ల్యాబ్‌లకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, నిర్మాణ, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పీఎం శ్రీ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ల్యాబ్‌ల నిర్మాణం, అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతం చేయాలని, విద్యార్థుల ప్రయోగాత్మక అభ్యసనానికి వాటిని సమర్థవంతంగా వినియోగించేలా చూడాలని ఆదేశించారు. అలాగే నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ ద్వారా యువతకు కంపెనీల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి, ఆయా సంస్థల సమన్వయంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమం పురోగతిని కూడా సమీక్షిస్తూ అర్హులైన యువతకు ఈ అవకాశాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాల విద్య, సమగ్ర శిక్షకు సంబంధించిన ప్రతి అంశంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలో సాధించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్, సమగ్ర శిక్ష ఏపీసీ వి.వి.వి. సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జ్యోతుల రాంబాబు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎస్. గోపికృష్ణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




# విద్యా రంగంలో హనుమకొండ జిల్లాకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హన్మకొండ, అక్టోబర్ 6 (జై భీమ్ న్యూస్)**

విద్యా రంగంలో హనుమకొండ జిల్లాను జాతీయ స్థాయిలో ముందంజలో నిలిపేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యా ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్ --2024)లో సాధించిన ర్యాంకును మించి, ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన విద్యా ప్రమాణాలు సాధించి పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ (పిఆర్ఎస్ --2027)లో హనుమకొండ జిల్లాకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని ఆమె సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని 108 ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్‌తో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) హాజరు, డ్రాప్ బాక్స్ ఏర్పాటు, ఎఫ్ఎల్ఎన్ అమలు, తనిఖీ బృందాల పనితీరు, ఖాన్ అకాడమీ, ఏఎక్సెల్ పాఠశాలల పురోగతి, విద్యార్థులకు ఉపయోగపడే అపార్ నమోదు తదితర అంశాలపై ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌పై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, నెలకు పైగా ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేయని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ విధానంలో హాజరు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల పేర్లు, ఇతర వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే అపార్ ద్వారా పాఠశాలల్లో నమోదు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. సమగ్ర శిక్ష ద్వారా ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని 45 పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలని, ఇప్పటికే ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టాలని ఆదేశించారు. వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీలలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని, పాఠశాలలకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి స్థానిక సర్పంచ్‌ల దృష్టికి తీసుకెళ్లాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఖాన్ అకాడమీ ద్వారా అందుతున్న విద్యా కార్యక్రమాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సహకరించాలని అన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఐపీ) వర్క్‌బుక్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుని మెరుగైన విద్యా ఫలితాలు సాధించే విధంగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వయోజన విద్యా డిప్యూటీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఏఎంవో డాక్టర్ మన్మోహన్, జీసీడీవో సునీత, సీఎంఓ సుమాదేవి, ఇతర అధికారులు, ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




# బార్ల యజమానులకు నష్టం లేదు.. వినియోగదారులపై స్వల్ప భారం

**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.40 వేల కోట్లకు మద్యం ఆదాయం**

**హైదరాబాద్, అక్టోబరు 6 (జై భీమ్ న్యూస్) :**

రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్ల యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, వినియోగదారులపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మద్యం ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందే తప్ప, వినియోగం పెద్దగా తగ్గదని గత అనుభవాలు చెబుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరం అప్‌గ్రేడ్ అయినందున ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగానే ఇక్కడా బార్ లైసెన్సులను జారీ చేశామని తెలిపారు. కొత్త రుసుము బార్ యాజమాన్యాలకు నష్టం కలిగించేది కాదని పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయం రూ.10 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్లకు, అంటే దాదాపు 260 శాతం పెరిగిందని జూపల్లి గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం ఆదాయం ప్రస్తుతం రూ.40 వేల కోట్లుగా ఉందని వివరించారు. ప్రభుత్వం చట్ట ప్రకారమే ముందుకు వెళుతోందని, మద్యం ఉత్పత్తికి నీటి కొరత ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు.

# తప్పుడు సమాచారం ఇచ్చిన పరికిపండ్ల భార్గవిపై చర్యలు తీసుకోవాలి

**కాట్రపల్లి వీవో అధ్యక్షురాలు శంకంపల్లి రజిని**




**కేసముద్రం, అక్టోబర్ 6 (జై భీమ్ న్యూస్)**

తప్పుడు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేసిన పరికిపండ్ల భార్గవిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మహిళా సంఘం నుంచి బహిష్కరించాలని కాట్రపల్లి వీవో అధ్యక్షురాలు శంకంపల్లి రజిని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాట్రపల్లి అయ్యప్ప మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం కేసముద్రం ఏపీఎం రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీవో అధ్యక్షురాలు శంకంపల్లి రజిని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అయ్యప్ప మహిళా సంఘాన్ని సభ్యుల సహకారంతో నిజాయితీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘానికి వచ్చే లింకేజీ రుణానికి సంబంధించి రూ.2 లక్షలు అదనంగా ఇవ్వాలని, లేకపోతే బ్యాంకు లోన్ రాకుండా చేస్తానంటూ పరికిపండ్ల భార్గవి తరఫున ఆమె భర్తగా పేర్కొన్న పరికిపండ్ల అశోక్ ద్వారా తమను బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. తాము ఎలాంటి తప్పు చేయకపోయినా చేసినట్లుగా తనపై, సీఏ స్వాతిపై కేసముద్రం మండల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారని రజిని పేర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా తప్పుడు సమాచారంతో ఫిర్యాదు చేయడం వల్ల మహిళా సంఘం సభ్యులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తప్పుడు సమాచారంతో ఫిర్యాదు చేసిన పరికిపండ్ల భార్గవిపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మహిళా సంఘం నుంచి బహిష్కరించాలని ఏపీఎం రాజేంద్రప్రసాద్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరినట్లు రజిని తెలిపారు. మహిళా సంఘాల కార్యకలాపాల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు గడ్డం కోమల, గునిగంటి సుజాత, జినుకుల ఉమా, పాలికోజు స్వప్న, ఊరుగొండ అమృత తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యతో అవస్థలు.. హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి

**ఏవీఎస్ పటేల్ మార్గ్‌లో కాలనీ వాసుల ఆవేదన**

**వరంగల్, అక్టోబర్ 6(జై భీమ్ న్యూస్)**




ఏవీఎస్ పటేల్ మార్గ్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. కార్యాలయాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. వార్డు ప్రతినిధులు కాలనీకి వచ్చి పరిస్థితిని పరిశీలించినప్పటికీ తదుపరి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాలనీలో డ్రైనేజీ మురుగునీరు నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా డెంగ్యూ, కలరా వంటి వ్యాధుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. నిలిచిన నీటిలో పందులు సంచరిస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మురుగునీరు నిలవకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మరోవైపు నివాస ప్రాంతంలో ప్రైవేట్ హాస్టళ్లు విచ్చలవిడిగా ఏర్పడుతున్నాయని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు రాత్రి వేళల్లో బయట తిరగడం, అరుపులు, గొడవలు వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, దీంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో శాంతిభద్రతలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు సరైన భద్రతా చర్యలు ఉన్నాయా అనే అంశంపై కూడా అధికారులు పరిశీలన చేపట్టాలని కోరుతున్నారు. ఆయా హాస్టళ్లకు అనుమతులు ఉన్నాయా, నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా, పారిశుద్ధ్య పరిస్థితులు ఎలా ఉన్నాయి, విద్యార్థులకు అవసరమైన భద్రతా సౌకర్యాలు కల్పిస్తున్నారా అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. డ్రైనేజీ నీరు నిలిచిపోవడం వల్ల ఇళ్ల ప్రహరీ గోడలు కూడా దెబ్బతింటున్నాయని కాలనీ వాసులు తెలిపారు. మురుగునీటి సమస్య కారణంగా తన ప్రహరీ గోడను ఇప్పటికే మూడుసార్లు మరమ్మతు చేయించుకోవాల్సి వచ్చిందని కాలనీ వాసి బైనా రాజు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ అసోసియేషన్ తరఫున కూడా పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించి వినతులు అందించినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలుషిత మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని, కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని, హాస్టళ్ల నిర్వహణపై సమగ్ర తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా ప్రజారోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.






జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ఒకరు కాదు ఇద్దరు కాదు..

**9 మంది దర్శకులతో 'కామ్రేడ్ కల్యాణ్' ట్రైలర్ లాంచ్**

**పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కల్యాణ్' సినిమా**

**శ్రీవిష్ణు కామెడీ టైమింగ్, రాధిక నటన హైలైట్‌గా ట్రైలర్**

**కోన వెంకట్ సమర్పణలో జానకిరామ్ దర్శకత్వం**

**అక్టోబర్ 9న థియేటర్లలోకి రానున్న 'కామ్రేడ్ కల్యాణ్'**



విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టాలీవుడ్‌కు చెందిన 9 మంది ప్రముఖ దర్శకులు ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. రామ్ గోపాల్ వర్మ, హరీశ్ శంకర్, అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, బాబీ, శివ నిర్వాణ, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, రామ్ అబ్బరాజు వంటి అగ్ర దర్శకులు కలిసి ఈ ట్రైలర్‌ను లాంచ్ చేయడం ఇండస్ట్రీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'కామ్రేడ్ కల్యాణ్' ట్రైలర్ విషయానికొస్తే, ఆద్యంతం నవ్వులు పంచేలా దీన్ని తీర్చిదిద్దారు. ఒక థియేటర్ ఓనర్ అయిన హీరో, అనుకోకుండా 'కామ్రేడ్'గా మారడం, ఆ తర్వాత జరిగే పరిణామాలు ఫన్నీగా ఉంటాయని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. శ్రీవిష్ణు తనదైన కామెడీ టైమింగ్‌తో, మేనరిజమ్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయన తల్లి పాత్రలో సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ నటన, కమెడియన్ సత్యతో సాగే సన్నివేశాలు నవ్వులు పూయించడం ఖాయంగా కనిపిస్తోంది. వెన్నెల కిషోర్, ఉపేంద్ర లిమాయే వంటి నటులు కూడా తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, షైన్ టామ్ చాకో కీలకమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న 'కామ్రేడ్ కల్యాణ్' సినిమాను వెంకటకృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. తన సినిమాకు మద్దతుగా నిలిచిన దర్శకులకు కోన వెంకట్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. "నా బలం, నా వాళ్లు" అంటూ వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన రాగా, తాజాగా విడుదలైన కామెడీ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. పూర్తిస్థాయి వినోదాన్ని పంచేలా రూపొందిన 'కామ్రేడ్ కల్యాణ్' ఈ నెల 9న థియేటర్లలో విడుదల కానుంది.

# ఫేమస్ యూట్యూబర్ మధుమితకు మరో షాక్..



**గొలుసు చోరీ, బెదిరింపుల కేసు**

**మధుమితపై గొలుసు దొంగతనం, బెదిరింపుల కేసు నమోదు**

**లిఫ్ట్ ఇచ్చి బస్టాప్‌లో దింపితే చైన్ చోరీ చేసిందని 89 ఏళ్ల వృద్ధుడి ఆరోపణ**

**2022లో జరిగిన ఘటనపై ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఫిర్యాదు**

**ఇటీవల మధుమిత ఇంట్లో భారీ చోరీ, ఐటీ దర్యాప్తు నేపథ్యంలో కొత్త కేసు**

**రాజాక్కమంగళం నుంచి తిరునెల్వేలి పోలీసులకు కేసు బదిలీ**

తమిళనాడుకు చెందిన ప్రముఖ యూట్యూబర్, సోషల్ మీడియా స్టార్ మధుమిత చిక్కుల్లో పడింది. తన మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును చోరీ చేసి, అడిగితే బెదిరించారంటూ 89 ఏళ్ల వృద్ధుడు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం గమనార్హం. తిరునెల్వేలి జిల్లా కేటీసీ నగర్‌కు చెందిన భవన నిర్మాణ కాంట్రాక్టర్ పేచ్చిముత్తు (89)కు నాగర్‌కోవిల్‌కు చెందిన యూట్యూబర్ మధుమితతో పరిచయం ఉంది. 2022లో ఒకరోజు ఆమె ఆయన వాహనంలో ప్రయాణించింది. పేచ్చిముత్తు ఆమెను బస్ స్టాప్‌లో దింపి ఇంటికి వెళ్లారు. ఇంటికి వెళ్లాక తన మెడలోని ఐదు సవర్ల గొలుసు కనిపించకపోవడంతో ఆయనకు అనుమానం వచ్చింది. వెంటనే మధుమితకు ఫోన్ చేసి గొలుసు గురించి అడగ్గా, పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు తీస్తానంటూ ఆమె తనను బెదిరించినట్లు పేచ్చిముత్తు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆయన ఇటీవల రాజాక్కమంగళం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, సంఘటన జరిగిన ప్రదేశం తిరునెల్వేలి పోలీసుల పరిధిలోకి రావడంతో కేసును అక్కడికి బదిలీ చేశారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో బంగారం, నగదుతో రీల్స్ చేస్తూ మధుమిత పాప్యులర్ అయింది. కాగా, ఇటీవలే ఆమె ఇంట్లో 118 సవర్ల బంగారం చోరీకి గురైన ఘటన సంచలనం సృష్టించింది. ఆ కేసులో పోలీసులు నలుగురిని అరెస్ట్ చేసి 98 సవర్ల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు, ఆమె ఆర్థిక లావాదేవీలపై ఆదాయపన్ను శాఖ కూడా దర్యాప్తు చేపట్టింది. ఈ పరిణామాల మధ్య పాత ఘటనకు సంబంధించి ఇప్పుడు కేసు నమోదు కావడంతో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు.

# ప్యారిస్‌లో చీరకట్టులో జాన్వీ



**గాలా ఈవెంట్‌లో ప్రత్యేక చీరకట్టుతో సందడి**

**'నేసిన గాలి'గా పేరొందిన బెంగాల్ మస్లిన్ చీర**

**పోల్కీలు, పచ్చలతో మెరిసిన జ్యూయలరీ బ్లౌజ్**

**ఆభరణాల్లా కనిపించిన బ్లౌజ్ స్లీవ్స్**

**భారతీయ హస్తకళకు ఆధునిక ఫ్యాషన్ జోడింపు**

**ప్యారిస్, అక్టోబర్ 6 (కొత్త స్వరం):**

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో ఆకట్టుకున్నారు. ప్యారిస్‌లో జరిగిన ఓ గాలా ఈవెంట్‌లో ఆమె ధరించిన ప్రత్యేకమైన చీరకట్టు అంతర్జాతీయ ఫ్యాషన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారతీయ హస్తకళకు ఆధునిక సొగసులు జోడించిన ఈ లుక్‌తో జాన్వీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీకి చెందిన 'పంకజ్ ఎస్. హెరిటేజ్' లేబుల్ రూపొందించిన చీరను ఆమె ఎంచుకున్నారు. సహజమైన ఐవరీ రంగులో ఉన్న ఈ చీరను చారిత్రక ప్రాధాన్యమున్న 460-కౌంట్ బెంగాల్ మస్లిన్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేశారు. మొఘలుల కాలంలో ఢాకా ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఈ వస్త్రాన్ని 'బాఫ్త్ హవా' (నేసిన గాలి)గా పిలిచేవారు. అంతటి సున్నితమైన చీరపై తెల్లటి చికంకారీ ఎంబ్రాయిడరీ అదనపు అందాన్ని తెచ్చిపెట్టింది. అయితే ఈ చీరకట్టులో అసలైన ఆకర్షణగా నిలిచింది ఆమె ధరించిన బ్లౌజ్. బ్లౌజ్ స్లీవ్స్‌ను పోల్కీలు, గార్నెట్‌లు, పచ్చలతో దట్టంగా పొదిగారు. భుజాలపై నుంచి జాలువారుతున్న ఆభరణాల్లా కనిపించిన ఈ స్లీవ్స్‌తో జాన్వీ మెడలో ఎలాంటి నెక్లెస్ ధరించకుండానే సంపూర్ణమైన లుక్‌ను సాధించారు. దీనికి తగ్గట్టుగా కోల్‌కతాకు చెందిన 'విరాయా జ్యూయలరీ' చెవిపోగులు, కఫ్‌లతో పాటు స్లీవ్స్‌కు మ్యాచింగ్ అయ్యేలా పచ్చలు పొదిగిన ఉంగరాన్ని ధరించారు. మేకప్ ఆర్టిస్ట్ నోరా కౌర్కిస్ అందించిన సాఫ్ట్ గ్లామ్ మేకప్, స్లీక్ బన్ హెయిర్‌స్టైల్ ఈ లుక్‌ను మరింత ఉన్నతంగా నిలబెట్టాయి. మొత్తంగా జాన్వీ కపూర్ లుక్ భారతీయ వారసత్వ హస్తకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన వారధిలా నిలిచిందని ఫ్యాషన్ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు.

# తెలుగు సినిమా ఒక్కటే

**హైదరాబాద్, అక్టోబర్ 6 (కొత్త స్వరం):**

తెలుగు చిత్ర పరిశ్రమలో సినిమాలను ప్రాంతాల వారీగా విభజించడం సరికాదని, ఉన్నది ఒకే ఒక్క తెలుగు సినిమా అని సీనియర్ నటుడు నరేశ్ అన్నారు. ఇటీవల తెలంగాణ సినిమా, రాయలసీమ సినిమా, ఉత్తరాంధ్ర సినిమా అంటూ ముద్రలు వేయడం ఫ్యాషన్‌గా మారిపోయిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన 'గరివిడి లక్ష్మి' బయోపిక్ ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ పాటలకు, సంగీతానికి ఎలాగైతే సరిహద్దులు ఉండవో సినిమాకు కూడా ఎలాంటి ప్రాంతీయ భేదాలు ఉండవని అన్నారు. ప్రేక్షకులు కొరియన్, మలయాళం, తమిళ సినిమాలను భాషతో సంబంధం లేకుండా ఆదరిస్తున్నప్పుడు మన సినిమాలను మనం ఎందుకు ప్రాంతాల వారీగా విడదీస్తున్నామని ప్రశ్నించారు. తమిళంలో వచ్చిన 'మణ్ వాసనై' (మట్టి వాసన) సినిమాను ఉదాహరణగా ప్రస్తావిస్తూ మట్టి వాసనకు ప్రాంతంతో సంబంధం లేదని, అది అందరినీ కలుపుతుందని అన్నారు. 'గరివిడి లక్ష్మి' కథ కూడా ప్రతి తెలుగు ప్రేక్షకుడిని కదిలిస్తుందని తెలిపారు. ప్రముఖ బుర్రకథ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంపై నరేశ్ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించే తొలి చిత్రం 'గరివిడి లక్ష్మి' అవుతుందని, 'మహానటి'లా వినోదం, భావోద్వేగాలు కలగలిపిన బయోపిక్‌గా ఇది రూపొందిందని అన్నారు. ఈ చిత్రానికి జాతీయ అవార్డులు కూడా వస్తాయని ఆశిస్తున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 17న థియేటర్లలో విడుదల కానుంది.

# పుస్తక రూపంలో రమాప్రభ జీవిత కథ.. 'ఇదేనండి నా కథ' ఆవిష్కరణ

**సీనియర్ నటి రమాప్రభ జీవిత కథ పుస్తక రూపంలో విడుదల**

**'రమాప్రభ.. ఇదేనండి నా కథ' పేరుతో పుస్తకం ఆవిష్కరణ**

**ఆమె 81వ పుట్టినరోజు సందర్భంగా మదనపల్లెలో కార్యక్రమం**

సీనియర్ నటి రమాప్రభ జీవిత ప్రయాణం పుస్తక రూపంలోకి వచ్చింది. 'రమాప్రభ.. ఇదేనండి నా కథ' పేరుతో వెలువడిన ఈ పుస్తకాన్ని ఆమె 81వ పుట్టినరోజు సందర్భంగా ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలోని బసినకొండ పంచాయతీ, గంగన్నగారిపల్లెలో ఉన్న ఆమె నివాసంలో స్థానిక ప్రముఖులు, అభిమానులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొంతకాలంగా సినీ పరిశ్రమకు దూరంగా ఉంటూ రమాప్రభ ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్నారు. స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు జింకల మోహనవల్లి, ఏడాది పాటు ఆమెను ఒప్పించి ఈ పుస్తకాన్ని రచించారు. సాధారణంగా చాలామంది తమ ఆత్మకథలను తామే రాసుకుంటారని, కానీ తన కథను మరొకరు రాయడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా రమాప్రభ అన్నారు. రమాప్రభ పుట్టినరోజున ఈ పుస్తకాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉందని రచయిత్రి మోహనవల్లి తెలిపారు. నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 1400కు పైగా చిత్రాల్లో నటించి రమాప్రభ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈ పుస్తకంలో ఆమె సినీ జీవితంలోని ఎత్తుపల్లాలతో పాటు, వ్యక్తిగత జీవితంలోని తీపి, చేదు జ్ఞాపకాలను పొందుపరిచారు. చిత్రజ్యోతి కథనం ప్రకారం, ఈ కార్యక్రమానికి నవలా రచయిత టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి, యాదవల్లి భారతి, పలువురు స్థానిక ప్రముఖులు, ఆమె అభిమానులు హాజరయ్యారు. వెండితెరపై ఓ వెలుగు వెలిగిన నాటి నుంచి మదనపల్లెలో ప్రశాంత జీవనం గడుపుతున్న నేటి వరకు ఆమె ప్రయాణాన్ని ఈ పుస్తకం ఆవిష్కరిస్తుంది.